సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 22 । జూలై । 2023



ఎగువమానేరులో 27 ఫీట్లు

గంభీరావుపేట: వర్షాల ఎగువమానేరులో 30 ఫీట్లకు శుక్రవారం 27 ఫీట్లకు నీరు చేరింది. కూడవెల్లి, పాల్వంచవాగుల ద్వారా వరదనీరు ప్రాజెక్టులోకి భారీగా వస్తోంది.



మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి 3,500 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. ఎల్‌ఎండీకి 4,492 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 15.38 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్ఠం/కనిష్ఠం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురుస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: కురుస్తున్న వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వర్షాలు, వరదలపై జిల్లా కార్యాలయం నుంచి వివిధ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100, దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రక్షణ చర్యలకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అందుబాటులో ఉండేవిధంగా తెలిపారు. వాగులు, వంకలు, నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉంటుందని సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. వర్షాలు పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న నివాసాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెగిన రోడ్ల వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

జేపీఎస్‌ల పనితీరు పరిశీలించిన త్రీమెన్ కమిటీ



బోయినపల్లి(చొప్పదండి): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా మండలంలోని జేపీఎస్‌ల పనితీరును శుక్రవారం త్రీమెన్ కమిటీ సభ్యులైన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఏఎస్పీ చంద్రయ్య, డీఎఫ్‌వో బాలామణి పరిశీలించారు. మండలంలోని కొదురుపాక, వెంకట్రావుపల్లి, జగ్గారావుపల్లి, రామన్నపేట, మల్కాపూర్, అనంతపల్లి, నర్సింగాపూర్, స్తంభంపల్లి, బూర్గుపల్లి గ్రామపంచాయతీల్లో జేపీఎస్‌ల రికార్డులు పరిశీలించారు. హరితహారం, పారిశుద్ధ్య నిర్వహణ, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డు పనులను తనిఖీ చేశారు. ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీవో గంగాతిలక్ ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో



కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు అత్యధిక జీపీఏను సాధించాలని కోరారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. జీసీడీవో పద్మజ, ప్రత్యేకాధికారి ఇందిర ఉన్నారు.

కూలీలను అడ్డుకున్న కార్మికులు



ఇల్లంతకుంట(మానకొండూర్): మండల కేంద్రంలో కూలీలతో పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా పంచాయతీ కార్మికులు శుక్రవారం అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి పనులు ఎందుకు చేయిస్తున్నారంటూ పంచాయతీ కార్యదర్శి వరుణ్, సర్పంచులను నిలదీశారు. సమ్మె ముగిసేవరకు ఎవరితోనూ పనులు చేయించొద్దని కోరారు. వరుకోలు మల్లయ్య, చందన, బాబు, కిరణ్, మహేందర్, రవి, బాలయ్య ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్యపరీక్షలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బొప్పాపూర్‌లో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి(సీఎస్‌సీ) హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 19 రకాల టెస్టులు, 50 రకాల ఫలితాలు పొందుతారని తెలిపారు. వైద్యులు హరిప్రసాద్, క్యాంప్ కోఆర్డినేటర్ మహేందర్, సభ్యులు విజేందర్, వేణుకుమార్, అభిషేక్, వంశీ, తిరుపతి, చరణ్, అఖిల, మమత, నీలోఫర్ పాల్గొన్నారు.



బుడగజంగాలకాలనీలో వరదనీరు



వేములవాడ – మల్లారం రోడ్డులోని కల్వర్టు పై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



జలమయమైన శ్రీనగర్‌కాలనీ

గెరువిస్తూ.. దంచికొడుతూ

అత్యధికం 102.4 వేములవాడ మి.మీ	అత్యల్పం 29.5 ఎల్లారెడ్డిపేట మి.మీ

కంట్రోల్‌రూమ్ నంబర్ 93986 84240

• పొంగిన ఒర్రెలు, వాగులు
• లోతట్టు ప్రాంతాల్లోకి వరద
• లోలెవల్ కాజ్‌వేలపై వరదనీరు
• పొంగి ఉన్న వ్యాధుల ముప్పు
• పారుతున్న మానేరు, మూలవాగులు

వర్షపాతం ఇలా..(మి.మీ)	
వేములవాడ	102.4
ఎల్లారెడ్డిపేట	29.5
రుద్రంగి	43.2
చందుర్తి	65.7
వేములవాడరూరల్	67.8
బోయినపల్లి	100.6
సిరిసిల్ల	66.4
కోనరావుపేట	45.1
వీర్నపల్లి	34.8
గంభీరావుపేట	37.2
ముస్తాబాద్	39.8
తంగళ్లపల్లి	43.6
ఇల్లంతకుంట	43.6

సిరిసిల్ల: నాలుగు రోజులుగా వర్షం వదలడం లేదు. గెరువిస్తూనే.. అంతలోనే దంచికొడుతుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ముసురువాన తో ఒర్రెలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలతో జిల్లాలో రవాణా వ్యవస్థ స్తంభించింది. గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో పాత ఇళ్లు కూలిపోయాయి. ఎగువమానేరు పై ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం 27 అడుగులకు చేరింది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగులోకి వరద చేరుతోంది.

• వేములవాడ–జగిత్యాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. శాత్రాజుపల్లి వద్ద తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది.
• హన్మాజీపేట వద్ద నక్కవాగు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.
• వేములవాడ–మల్లారం మార్గం, బోయినపల్లి మండలంలో ఒర్రెలు పొంగుతున్నాయి.

పొంగిన వాగులు.. కూలిన ఇళ్లు

సిరిసిల్లటౌన్/వేములవాడ/చందుర్తి/కోనరావుపేట/ముస్తాబాద్/బోయినపల్లి/తంగళ్లపల్లి/వేములవాడరూరల్/రుద్రంగి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు వాగులు పొంగుతున్నాయి. వాగులు, వంకలు, ఒర్రెలు పొంగిప్రవహిస్తున్నాయి.

• వేములవాడలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ రాజారెడ్డి తెలిపారు.
• వేములవాడ శివారులోని మల్లారంరోడ్డు, కోనాయిపల్లిరోడ్డులోని నివాసాల్లోకి వరదనీరు వచ్చి చేరింది.
• వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని బుడిగజంగాలకాలనీలోకి వరదనీరు చేరడంతో మున్సిపల్ అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.
• వేములవాడ శివారులోని మూలవాగునిండుగా ప్రవహిస్తోంది. నిమ్మపల్లి ప్రాజెక్టు నిండింది.
• చందుర్తి మండలంలోని 19 కుంటలు నిండాయి. మల్యాలవెంగళచెరువు మత్తడి పోస్తుంది.
• ముస్తాబాద్ మండలంలో ఆరు ఇండ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ మునీందర్ తెలిపారు. ముస్తాబాద్‌లో 3, రామలక్ష్మణపల్లి, తెర్లుమద్ది, వెంకట్రావుపల్లిల్లో ఒక్కో ఇల్లు కూలిపోయాయి. రామలక్ష్మణపల్లి వద్ద మానేరు వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో భద్రత చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు, సర్పంచ్ లచీందర్‌రెడ్డి తెలిపారు.
• బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి గంజివాగు, బోయినపల్లి కల్వర్టులపై నుంచి వరద ప్రవహిస్తుంది. వేములవాడ, కొదురుపాకలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో కల్వర్టుల వద్ద బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. గంజివాగు వద్ద వరద ఉధృతిని వేములవాడ ఆర్డీవో పవన్ కుమార్ పరిశీలించారు.
• తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని బొమ్మెన కిరణ్ ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు.
• తంగళ్లపల్లి మండలం పద్మనగర్ నుంచి అంకుసాపూర్ వెళ్లే దారిని సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో మూసివేశారు. రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, సర్పంచ్ ముదారి పోచయ్య, కార్యదర్శి నీరజ పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం కోరారు. మానేరు, మూలవాగు పరివాహక ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, జలాశయాల వద్దకు ఎవరూ వెళ్లవద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. పాతబడిన ఇళ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నిద్రించొద్దన్నారు. అవసరమైన తాత్కాలిక నివాసం అవసరమైతే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు. లోలెవల్ కల్వర్టులు, వంతెనల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటలపాటు పనిచేస్తుందని, అత్యవసర వేళల్లో 93986 84240 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



శాత్రాజుపల్లి వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టు



సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్ ఎదుట నిలిచిన నీరు



మత్తడి దూకుతున్న మల్యాల వెంగళచెరువు



వెంకట్రావుపల్లిలో కూలిన ఇంటి వద్ద బాధితులు



సిరిసిల్లలో ఒరిగిన విద్యుత్‌స్తంభాలు



శాంతినగర్–శ్రీనగర్‌కాలనీ మధ్య మార్గంలో..



వేములవాడలో సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న జనం



బోయినపల్లి కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద



బురదమయమైన శ్రీనగర్‌కాలనీ దారి

పొరపాట్లు లేకుండా ఓటరు నమోదు చేపట్టాలి

• అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



ముస్తాబాద్‌లో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముస్తాబాద్(సిరిసిల్ల): పొరపాట్లు లేకుండా ఓటరు నమోదు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. ముస్తాబాద్ మండల పరిషత్‌లో నిర్వహిస్తున్న బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల శిక్షణ తరగతులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పద్దెనిమిదేళ్లు పూర్తయిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. మృతుల పేర్లు, స్థానికంగా లేని వారి పేర్లు తొలగించాలన్నారు. అక్టోబర్ ఒకటి నాటికి అర్హులందరిని ఓటర్లుగా నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఓటరు నమోదు, సవరణ, తొలగింపును పారదర్శకంగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ మునీందర్, డీటీ సురేశ్, ఎంపీడీవో రమాదేవి, ఆర్‌ఐ శ్యామ్, ఏఎస్‌వో బాలకృష్ణ, రమ, సరోజ్ పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

సిరిసిల్ల: జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం జెడ్పీ ఆఫీస్‌లో చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా శాఖల జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలకు జెడ్పీటీసీ సభ్యులు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

విపత్తు యోధులు సిద్ధం..!

• వరదలను ఎదుర్కొనేందుకు ఫైర్‌సర్వీస్ సమాయత్తం
• సిబ్బందికి సెలవులు రద్దు చేసిన ఉన్నతాధికారులు
• స్పీడ్‌బోట్లు, వాహనాలు, ఎక్విప్‌మెంట్ సిద్ధం
• ఎల్‌ఎండీలో రెస్క్యూ ఆపరేషన్ మాక్‌డ్రిల్
• శిథిలాల్లో చిక్కిన వారిని రక్షించే ప్రత్యేక కెమెరాలు



ఎల్‌ఎండీలో మాక్‌డ్రిల్ చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో జోరుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అగ్నిమాపకశాఖలతోపాటే కీలకమైన ఫైర్‌సర్వీస్‌ను కూడా సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లీవుల్లో ఉన్న సిబ్బంది అంతా ప్రభుత్వ అత్యవసర ఆదేశాలతో వెంటనే వచ్చి విధుల్లో చేరారు. 24 గంటలపాటు అందుబాటులో ఉన్నామని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ (డీఎఫ్‌ఓ) వెంకన్న వెల్లడించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వర్షం వల్ల ఎక్కడ ఎలాంటి వరదలు వచ్చినా.. లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా.. వెంటనే అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నీటిపారుదల, రెవెన్యూ, పోలీసులతో సంప్రదింపులు జరుపుతూ, ఎక్కడ ఎలాంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారి వద్ద ఉన్న మ్యాన్‌పవర్, ఎక్విప్‌మెంట్, యాక్షన్ ప్లాన్‌ను డీఎఫ్‌ఓ వెంకన్న ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రత్యేక ఎక్విప్‌మెంట్..

ఫైర్‌సర్వీస్ వద్ద లైఫ్‌జాకెట్లు, ఇన్‌ఫ్లేటబుల్ బోట్లు, స్విమ్మర్లు, గ్లోవ్స్, రోప్స్. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో ఫైర్‌సర్వీస్ అధికారులు డీజీపీ ఆదేశాల మేరకు అత్యవసర సేవల్లో ఇప్పటికే చేరిపోయారు. ముఖ్యంగా ఎగువమానేరు, మధ్యమానేరు, లోయర్‌మానేరు, ఎల్లంపల్లి, గోదావరి పరివాహక ప్రాంతాల వద్ద అగ్నిమాపక సిబ్బంది ఇప్పటికే మోహరించారు. వానల తీవ్రత, మిడ్‌మానేరులో పరివాహక ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త బోటు కొనిచ్చిన ఎస్పీ కూడా సుమారు వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఎల్‌ఎండీలో అగ్నిమాపక అధికారులు మాక్‌డ్రిల్ ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అగ్నిమాపక అధికారులు అవసరాన్ని బట్టి సింగరేణి రెస్క్యూ బృందాలను సైతం వినియోగించుకునే వీలుంది.

విక్టిమ్ లోకేషన్ కెమెరా..

కరీంనగర్ జిల్లా అగ్నిమాపక కేంద్రంలో విక్టిమ్ లొకేషన్ కెమెరా అందుబాటులో ఉంది. వరద ఉధృతికి పాత ఇళ్లు కూలితే.. శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను గుర్తించేందుకు ఉపయోగపడే కెమెరా ఇది. సుమారు 10 మీటర్ల కింద శిథిలాల్లో చిక్కుకున్న మనుషులు, జంతువులు.. ఏవైనా సరే దీని ద్వారా నేరుగా చూసే వీలు చిక్కుతుంది. ఆదేవిధంగా దీనిలో ఉండే కేబుల్ కెమెరా ద్వారా శిథిలాలకు రంధ్రం చేసిచూసే వీలుంటుంది. ఈ కెమెరా దాదాపు రూ.12 లక్షల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు.

24 గంటలు అందుబాటులో ఉంటాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మేం 24 గంటలపాటు విధుల్లోనే ఉంటున్నాం. మా సిబ్బంది సెలవులు రద్దుచేసుకున్నారు. ప్రజలు ఎక్కడ నీటిలో చిక్కుకున్నా.. కాపాడేందుకు, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వెంకన్న, డీఎఫ్‌ఓ

గెస్ట్‌లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

• డీఐఈవో మోహన్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టుల్లో తాత్కాలిక పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఐఈవో మోహన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల బాలుర కళాశాలలో గణితం–1, బాటనీ–1, జువాలజీ–1, సీఈ–1, ఎంఎల్‌టీ–1, ఎంపీహెచ్‌డబ్ల్యూ–1, బాలికల కళాశాలలో జువాలజీ–1, కోనరావుపేటలో ఫిజిక్స్–1, ఇల్లంతకుంటలో బాటనీ–1, కామర్స్–1, హిందీ–1, వేములవాడలో బాటనీ–1, ఓఏ–1, రుద్రంగిలో బాటనీ–1, జువాలజీ–1, కెమిస్ట్రీ–1, గంభీరావుపేటలో గణితం–1, ఫిజిక్స్–1, కెమిస్ట్రీ–1, బాటనీ–1, ముస్తాబాద్‌లో ఫిజిక్స్–1, కెమిస్ట్రీ–1, ఎకనామిక్స్–1, ఎల్లారెడ్డిపేటలో ఫిజిక్స్–1, గణితం–1, ఎకనామిక్స్–1, ఇంగ్లిష్–1 ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను సిరిసిల్లలోని డీఐఈవో ఆఫీసులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందించాలని కోరారు.

గర్భిణుల వైద్యానికి ప్రత్యేక శ్రద్ధ

సిరిసిల్లటౌన్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లాలోని గర్భిణులకు సమయానికి వైద్యం అందించేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో గర్భిణులకు అత్యవసరంగా సేవలు అందేలా టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవలకు 73965 53254లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కిషన్‌రెడ్డికి రాజన్న ప్రసాదం



వేములవాడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డికి వేములవాడ రాజన్న ప్రసాదాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ అందజేశారు. శాలువాతో సత్కరించారు.

పత్తిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

సిరిసిల్ల: జిల్లాలో ముసురు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ శుక్రవారం కోరారు. జిల్లాలో పత్తి, ఇతర ఆరుతడి పంటల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా తొలగించాలని తెలిపారు. వర్షం నీరు తొలగించిన తరువాత రైతులు 19:19:19 నానో డీఏపీ, నానో యూరియా ఎరువులను పిచికారీ చేయాలని సూచించారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా వినోద్



బోయినపల్లి(చొప్పదండి): యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండలంలోని దేశాయిపల్లికి చెందిన నిమ్మ వినోద్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వినోద్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం నియామకపత్రం అందించారు.

వివాదాలు లేకుండా విగ్రహాలు పెట్టుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రుద్రంగి(వేములవాడ): వివాదాలకు తావులేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. మానాల నందిచౌరస్తాను శుక్రవారం పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో గొడవలు జరుగుతున్నాయని తెలుసుకున్న డీఎస్పీ గ్రామస్తులతో చర్చించారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి



జి.శ్రీనివాస్

గోదావరిఖని: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు చేశారు. కరీంనగర్‌కు చెందిన కె.అంజయ్య, సిరిసిల్లకు చెందిన జి.శ్రీనివాస్, రామగుండంకు చెందిన ముస్కెం శ్రీనివాస్, జోన్–3 రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లింగంపెల్లి నరేందర్‌కు పదోన్నతి లభించింది.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి



ఇతను వీర్నపల్లి మండలం కంచర్లకు చెందిన పెంచాల నర్సింగం. నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా వరి, పత్తి సాగు చేసేవాడు. వరితో నష్టం రావడంతో ఉద్యానవనశాఖ అధికారుల సలహాలు, సూచనలతో నాలుగు ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాడు. ఇందులోనే పత్తి, కూరగాయలు, ఇతర పంటలను పండిస్తూ ఆదాయం పొందుతున్నాడు.

- జిల్లాలో పెరుగుతున్న సాగువిస్తీర్ణం
- ఇప్పటికే 1,466.7 ఎకరాలలో సాగు
- దీర్ఘకాలిక ఆదాయంపై రైతుల దృష్టి



ఎదిగిన మొక్కలు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి



వీర్నపల్లిలో ఆయిల్‌పామ్ మొక్కలు

వీర్నపల్లి(సిరిసిల్ల): సంప్రదాయ పంటలు సాగు చేస్తూ నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు, కూలీల కొరతను అధిగమించడంతోపాటు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే పంటలపై దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, అధికారుల సలహాలు, సూచనలతో ఆయిల్‌పామ్‌పై జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1466.7 ఎకరాలలో ఆయిల్ పామ్‌ను సాగు చేశారు.

ముందుకొస్తున్న రైతులు

జిల్లా పరిధిలో సుమారు 2.4 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 1.7 లక్షల ఎకరాల్లో వరి, సుమారు 60 వేల ఎకరాలలో పత్తి సాగుచేస్తున్నారు. జిల్లాలోని భూములు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడే నూనెను ఉత్పత్తి చేసేందుకు ఓ ప్రైవేటు కంపెనీ ముందుకు రావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. 2022–23లో 292 మంది రైతులు 974.34 ఎకరాలలో నాటుకున్నారు. ఈ సంవత్సరం 116 మంది రైతులు 491.13 ఎకరాలలో పెంపకానికి అధికారులు మంజూరు ఇచ్చారు. ఇప్పటి వరకు 1466.7 ఎకరాలలో ఆయిల్‌పామ్‌ను సాగుచేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో..

- ఎకరం వరి పంట పండించే నీటితో మూడెకరాలలో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయవచ్చు.
- ఎకరానికి 50–57 మొక్కలు వరకు నాటుకోవచ్చు. మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్ల దూరం ఉండాలి.
- 12–14 నెలల వయస్సు గల మొక్కలను నాటుకోవాలి.
- రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో మొక్కను రూ.20లకు సబ్సిడీ కింద అందిస్తుంది.
- డ్రిప్ సిస్టమ్ ద్వారా మొక్కలకు నీరందించవచ్చు.
- ఫర్టిగేషన్ ద్వారా ఎరువులను అందిస్తే కూలీల ఖర్చు కూడా ఉండదు.
- ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.4200 జమచేస్తుంది.
- మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి దిగుబడి వస్తుంది.
- ఎకరానికి సరాసరి 10–12 టన్నుల దిగుబడి వస్తుంది.

ముప్పై ఏళ్ల వరకు ఆదాయం



ఆయిల్‌పామ్ సాగుచేసిన నాలుగో సంవత్సరం నుంచి ముప్పై ఏళ్ల వరకు ప్రతీ రెండు నెలలకోసారి నిరంతరం ఆదాయం వస్తూనే ఉంటుంది. ఎకరానికి ఏడాదిలో ఆరు టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు రూ.23 వేలు పలుకుతుంది. ఎకరం భూమిలో 50 మొక్కలు నాటి డ్రిప్ ద్వారా నీరందిస్తే నాలుగేళ్ల తరువాత ఎకరానికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మూడేళ్ల వరకు అంతర పంటగా పత్తి, వేరుశనగ, కూరగాయలు సాగు చేసుకోవచ్చు.

– శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి, వీర్నపల్లి

మండల పరిషత్‌లో విద్యుదాఘాతం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల పరిషత్‌లో మరోసారి విద్యుదాఘాతం జరిగింది. రెండు నెలల క్రితమే విద్యుదాఘాతంతో ఎంపీవో చాంబర్ కాలిపోయిన ఘటన మరువక ముందే శుక్రవారం మండల పరిషత్‌లో మరోసారి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఎంపీడీవో చాంబర్‌లో ట్యూబ్‌లైట్ల నుంచి పొగలు రావడంతో మంటలు లేచాయి. సిబ్బంది పనిచేసే గదిలో కేబుల్ నుంచి మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో రెండు కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయని, సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని ఎంపీడీవో రమాదేవి తెలిపారు.

అనారోగ్యంతో జీపీ కో–ఆప్షన్ సభ్యుని మృతి



కిష్టయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన గ్రామ పంచాయతీ కో–ఆప్షన్ సభ్యుడు ఉల్లి కిష్టయ్య(65) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్‌ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్న కిష్టయ్య మరణంతో పార్టీ నాయకులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నివాళి అర్పించారు. వారి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మృతునికి భార్య సులోచన, ముగ్గురు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల్లో సర్పంచ్ కదిరె రజిత, ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, శరవింద్, రాజిరెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ఆర్డీవో శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: ప్రభుత్వ ఉద్యోగులకు విధినిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల ఆర్డీవోగా పనిచేసి హైదరాబాద్ శేరిలింగంపల్లికి బదిలీ అయిన టి.శ్రీనివాస్‌రావుకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల ఆర్డీవోగా శ్రీనివాస్‌రావు ఐదేళ్లపాటు సమర్థంగా పనిచేశారన్నారు. మధ్యమానేరు, అనంతగిరి ప్రాజెక్టు, ఆక్వాహబ్ ప్రాజెక్టు, రైల్వేలైన్ భూసేకరణ వంటి కీలకమైన విధులు నిర్వహించారని గుర్తుచేశారు. కోవిడ్, ఎన్నికల సమయంలోనూ ఎంతో సమయస్ఫూర్తితో పనిచేశారని కొనియాడారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ఆర్డీవోగా, జిల్లా రెవెన్యూ అధికారిగా శ్రీనివాస్‌రావు సమర్థంగా పనిచేశారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో ఒకే ఒక్క డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో శేరిలింగంపల్లి తహసీల్దార్ పోస్టు ఉందని.. అది శ్రీనివాస్‌రావుకు ఇవ్వడం పనితీరుకు నిదర్శనమన్నారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అందరి సహకారంతో ఐదేళ్లపాటు సిరిసిల్లలో పనిచేశానని, తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, సీపీవో పీబీ శ్రీనివాసాచార్యులు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాఘవేందర్, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, మైనార్టీశాఖ ఓఎస్‌డీ సర్వర్‌మియా, కలెక్టరేట్ ఏవో గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి రూ.2.48 కోట్లు

వేములవాడరూరల్: వేములవాడలో నూతన వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి రూ.2.48 కోట్లు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మల్లిపల్లి శివారులో 13.5 ఎకరాల్లో నిర్మించే మార్కెట్ కమిటీ కోసం గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికిగాను ఇటీవల కాంపౌండ్, షెడ్లు, ఆఫీస్ గదులు, బాత్‌రూంలు, బోరు, ప్లాంటేషన్, సీసీరోడ్లు, హైమాస్ట్‌లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్థలాన్ని శుభ్రం చేసేందుకు అదనంగా మరో రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. వేములవాడలోని మార్కెట్ యార్డును అక్కడికి తరలించి నూతన మార్కెట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారిణి స్రవంతిరెడ్డి



తిమ్మాపూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): క్షయ వ్యాధి నుంచి రక్షించుకునేందుకు అందరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని మండల వైద్యాధికారి స్రవంతిరెడ్డి కోరారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్, గుండారం, బాకూర్‌పల్లితండాల్లో శుక్రవారం క్షయవ్యాధి గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 40 మంది అనుమానితుల నుంచి తెమడను తీసి ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయగా.. నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది. వ్యాధి నిర్ధారణ అయిన వారు ప్రతీ నెల మందులు వాడాలని సూచించారు. దగ్గు, దమ్ము సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ల్యాబ్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏఎన్‌ఎం ప్రవీణకుమారి, సువర్ణ, సర్పంచ్ పడిగెల రవీందర్ పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ స్కైవే ఏర్పాటుకు సానుకూలం



రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన కేటీఆర్, వినోద్(ఫైల్)



డబుల్ డెక్కర్ స్కైవే మోడల్

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి శామీర్‌పేట మధ్యలో డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో కరీంనగర్–హైదరాబాద్ మధ్యలో ప్రయాణానికి మహర్దశ కలగనుంది. ఇటీవల ఈ ప్రతిపాదనకు కేంద్రం సానుకూలత వ్యక్తం చేసిందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. డబుల్ డెక్కర్ స్కైవే మూడంచెలలో ఉంటుందని, పైభాగంలో మెట్రోరైలు, మధ్యలో ఫ్లై ఓవర్, కింది భాగంలో రోడ్డు ఉంటుందని వివరించారు. పనులు పూర్తయ్యే నాటికి దాదాపు ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కరీంనగర్ మార్గంలో హైదరాబాద్ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు హైదరాబాద్‌కు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలతో కలిసి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిపిన చర్చలలో ఈ ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్లు తెలిపారు.

‘మణిపూర్ దుండగులను ఉరితీయాలి’



నివాళి అర్పిస్తున్న గిరిజన నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అమానవీయ ఘటనలోని దుండగులను ఉరితీయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు అజ్మీర తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. తిరుపతినాయక్ మాట్లాడుతూ మణిపూర్ సీఎంకు మహిళలపై గౌరవం ఉంటే వెంటనే ఆ దుండగులను ఎన్‌కౌంటర్ చేయాలని కోరారు. గిరిజన నాయకులు భూక్య దేవిలాల్, సర్పంచ్ గుగులోత్ పెంటయ్య, మాలోత్ పుణ్యానాయక్, ఉపసర్పంచ్ కైలాస్ గణపతి, రాజునాయక్, సుదర్శన్, కళ్యాణ్, పరశురాం, రాజు పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి

మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్రలను చేసిన నిందితులను ఉరితీయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర రాజునాయక్ శుక్రవారం కోరారు. గిరిజనులపై ఇంత దారుణం జరుగుతుంటే మంత్రులు స్పందించకపోవడం దారుణమన్నారు. మైతేలి, కుకీ తెగల మధ్య జరిగిన ఘర్షణకు కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వమేనని విమర్శించారు.

సిరిసిల్లటౌన్: యావత్ దేశం తలదించుకునే మణిపూర్ సంఘటనలోని నిందితులను వెంటనే శిక్షించాలని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత కోరారు. ఈమేరకు ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మణిపూర్ ఘటనలో దేశవ్యాప్తంగా విమర్శలు వస్తుంటే కేంద్ర సర్కారు మిన్నకుండడం సిగ్గుచేటన్నారు. బాధితులైన ఆదివాసీ మహిళలకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వైద్యశాఖలో ‘భానమతి’ భయం

- వేములవాడ ఉద్యోగికి బెదిరింపు లేఖ
- కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు

సిరిసిల్లక్రైం: శాస్త్రీయతతో ప్రాణాలను కాపాడే వైద్యులు ఉండే వైద్యశాఖలోని ఉద్యోగులు భానమతి(చేతబడి) పేరిట బెదిరింపులకు పాల్పడగా పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగికి ఆదేశాఖలో పనిచేసే మరో ఉద్యోగికి ఉన్న విభేదాలను సరిచేయడానికి చేతబడిని ఎంచుకోవడం, ప్రాణభయం ఉందని బాధిత ఉద్యోగి కుటుంబీకులు ఠాణా మెట్లు ఎక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్ కాపీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల వైద్య ఆరోగ్యశాఖలోని సూపరింటెండెంట్ తమ్మిశెట్టి నాగరాజు డిప్యూటేషన్‌పై వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. పదోన్నతి విషయంలో మరొకరితో వివాదం ఉంది. దీనికి సంబంధించిన అన్ని అంశాలను కోర్టుకు సమర్పించగా కోర్టు నాగరాజు పదోన్నతికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇది అమలుకావడం లేదని నాగరాజు మరో పిటిషన్ వేశాడు. ఇదిలా ఉండగా ఈనెల 5న నాగరాజు నివాసానికి ఓ ఉత్తరం వచ్చింది. ఈనెల 17లోగా కోర్టులోని కేసు వాపస్ తీసుకోవాలని లేకుంటే ఇంట్లోని వారందరికీ భానమతి(చేతబడి) చేయించి చంపేస్తామని బెదిరింపులు ఉన్నాయి. అంతేకాదు నాగరాజు లంచగొండి, కోర్టులో తప్పుడు కేసులు వేస్తాడని, అమ్మాయిలను మోసం చేస్తాడని రాసి ఉంది. వెంటనే నాగరాజు భార్య లెటర్ వచ్చిన ఏరియాలోని పోస్టాఫీస్ సీసీ పుటేజీలు కావాలని హైదరాబాద్ హెడాఫీస్‌కు విన్నవించడి.. వారు సీసీ పుటేజీలు ఇచ్చారు. సీసీపుటేజీల్లో జగిత్యాల వైద్యశాఖలో పనిచేసే సూపరింటెండెంట్ అహ్మద్ హుస్సేన్‌గా గుర్తించారు. కోర్టు కేసులో గెలిచి నాగరాజుకు పదోన్నతి వస్తే అదే శాఖలో పనిచేసే అహ్మద్ హుస్సేన్ పదోన్నతికి ఆటంకం కలుగుతుందన్న దురుద్దేశ్యంతోనే చేతబడి పేరిట బెదిరింపు లేఖ రాసినట్లు కరీంనగర్ టూ టౌన్‌లో నాగరాజు భార్య ఈనెల 11న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాఖలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మూఢనమ్మకాల పేరిట బెదిరింపులు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

‘వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ‘కులాలబంధు’లు’

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కులాల బంధును తెరపైకి తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కొందరికే దళితబంధు ఇచ్చి మొండిచేయి చూపిన ప్రభుత్వం ఇప్పుడు బీసీబంధు అంటూ రూ.లక్ష ఇస్తామని ప్రగల్భాలు పలుకుతోందన్నారు. ఓట్లు దండుకునేందుకు కులాలబంధుల పేరుతో ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. నాయకులు గుండాడి రాంరెడ్డి, చెన్నిబాబు తదితరులు ఉన్నారు.

నేషనల్ లెవల్ మ్యూజికల్ ఫెస్టివల్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఆగస్టు 9న జాతీయస్థాయి మ్యూజికల్, డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు లంబోధర కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు నక్క అశోక్ తెలిపారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 766 మంది చిన్నారులతో దేశభక్తి గేయంపై ఒకే వేదికపై నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు పొందుర్తి ధర్మేందర్, సుంకటి సురేష్, తడగొండ మధు, జంగిలి రఘు, వేముల శ్రీకాంత్, కత్తెరపాక వెంకటేశ్, దూలపల్లి రాకేశ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో కరీంనగర్ డీఐఈవో మృతి



రాజ్యలక్ష్మి (ఫైల్)



డీఐఈవో మృతదేహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్: కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) టి.రాజ్యలక్ష్మి శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత మూడున్నరేళ్లుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి టైపిస్టుగా ఉద్యోగంలో చేరి జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీఐఈవోగా సేవలందించారు. భర్త పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చేసి గతంలోనే పదవీ విరమణ పొందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వస్థలం సిరిసిల్ల జిల్లా అయినప్పటికీ 30ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా కరీంనగర్‌లోని చైతన్యపురిలో స్థిరపడ్డారు. రాజ్యలక్ష్మి భౌతికకాయానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు.







వర్షంలోనూ జీవనపోరాటం

వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లా ప్రజల జనజీవనం అస్తవ్యస్తమైంది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోని శివారుకాలనీలు జలమయమయ్యాయి. ఒక వైపు ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంటే మరోవైపు శ్రమజీవులు జీవనపోరాటం కొనసాగించారు. కూరగాయల వ్యాపారులు, మత్స్యకారులు తమ బతుకుదెరువుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వ్యాపారాలు కొనసాగించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు విధులకు వెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల